క్లుప్తంగా

నిరుపయోగంగా ప్రభుత్వ స్థలాలు



ఏలేశ్వరంలో నిరుపయోగంగా ఉన్న స్థలం

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో బహిరంగ మరుగుదొడ్లు కూల్చివేసిన ఖాళీస్థలాలు నిరుపయోగంగా మారాయి. పట్టణంలోని సుబ్బయ్యమ్మపేట, కప్పల చెరువు, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో ఆ స్థలాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మరుగుదొడ్లు కూల్చివేశారు. దీంతో ఒక్కో చోట వందల గజాల స్థలం ఖాళీగా ఉంది. ఇవి ప్రధాన రహదారిని ఆనుకుని ఉండడంతో ఈ స్థలాల్లో కమ్యూనిటీ హాలు లేదా పార్కు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అప్పట్లో వీటిని పట్టణ శివారులో నిర్మించగా ప్రస్తుతం అవి ప్రధాన ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రస్తుతం వీటి విలువ రూ.లక్షల్లో ఉంది. ఈ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లైన్‌మన్‌ను నియమించాలంటూ ఆందోళన

తొండంగి: దీర్ఘకాలంగా తొండంగి గ్రామానికి విద్యుత్ లైన్‌మన్ లేకపోవడంతో ప్రజలు కరెంట్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే లైన్‌మన్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్తులు గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. కొద్దినెలల నుంచి తొండంగి గ్రామానికి విద్యుత్ లైన్‌మన్ లేకపోవడంతో వర్షాలు, ఇతర కారణాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే మరమ్మతులు కూడా జరగడం లేదు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది గ్రామస్తులు గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. తక్షణమే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి లైన్‌మన్‌ను నియమించాలని కోరారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించి లైన్‌మన్ నియామకానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

కోడి పందేలాడుతున్న ముగ్గురి అరెస్టు

కొత్తపల్లి: కోడి పందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రమణక్కపేట శివారు కేఎస్ఈజెడ్ భూముల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో కార్మికులను అక్రమంగా తొలగించి 78 రోజులు గడచినా, వారిని విధుల్లోకి చేర్చుకోవడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కాంత్రికుమార్ ఆరోపించారు. నెల రోజులుగా ఫ్యాక్టరీ గేటు ఎదురుగా కార్మికులు చేస్తున్న ఆందోళన ఆదివారమూ కొనసాగింది. స్థానిక ఏడీబీ రోడ్డులో కొనసాగుతున్న వీరి ఆందోళనకు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దాపురం ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబి, ఎస్తేర్‌రాణి, నాగమణి, దేవి మాట్లాడారు. కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ మంత్రికి కూడా ఫ్యాక్టరీ అధికారులు అవాస్తవాలు చెబుతున్నారని ఆరోపించారు. కార్మికులు ఆదివారం వాలీబాల్ ఆడుతూ నిరసన తెలిపారు.

వనరులు ఫుల్.. వినియోగం నిల్

- అక్కరకు రాని సాగునీటి ప్రాజెక్టులు
- జలాలు మళ్లిస్తే ఆయకట్టు సస్యశ్యామలం
- జడేరు మడేరు జలాలను సాగర్‌కు మళ్లించాలని కోరుతున్న అన్నదాతలు



ఏలేరు ఎడమ కాలువ నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు తరలిపోతున్న ఏలేరు జలాలు

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలో పుష్కలంగా సాగునీటి వనరులు ఉన్నా రైతులకు అక్కరకు రాని పరిస్థితి నెలకొంది. సుమారు పది వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరంలో సుబ్బారెడ్డిసాగర్ మధ్యతరహా ప్రాజెక్టు నిర్మించారు. కాగా ఈ జలాశయం పూర్తి స్థాయిలో ఆధునీకరణకు నోచుకోలేదు. అలాగే ప్రత్తిపాడు మండలంలో మరో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించమే లక్ష్యంగా 19 ఏళ్ల కిందట కిత్తమూరిపేట వద్ద కట్టుచింతల ప్రాజెక్టు నిర్మించారు. కాగా ఈ జలాశయం నేటికీ కాలువలకు నోచుకోలేదు. ఏలేశ్వరంలోని ఏలేరు రిజర్వాయర్ ఎడమ కాలువ నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల మీదుగా నీటి సరఫరా జరుగుతున్నా సేద్యానికి పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి స్థానిక రైతులది. దీంతో సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడక తప్పడం లేదు.

జడేరు మడేరు జలాలను సాగర్‌కు మళ్లిస్తే...

జడేరుమడేరు జలాలను సుబ్బారెడ్డిసాగర్‌కు మళ్లిస్తే సాగర్ ఆయకట్టు పరిధిలో రెండు పంటలూ పండే అవకాశం ఉంది. ఏలేరు ప్రాజెక్టుకు వెళ్లే జడేరుమడేరు జలాలను జడ్డంగి వద్ద ఉన్న చెక్ డ్యాం నుంచి ఎనిమిది కిలో మీటర్ల మేర కాలువ తవ్వితే గొంతీదేవివాగు మీదుగా సుబ్బారెడ్డిసాగర్‌కు జలాలు చేరుతాయి. ఇదే జరిగితే సాగర్ ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఏలేరు జలాలను సేద్యానికి వినియోగించాలి

ఏలేరు రిజర్వాయర్ ఎడమ కాలువ నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్తిపాడు మండలం మీదుగా వెళ్లే జలాలను సేద్యానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నో ఏళ్లుగా రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఈ కాలువను ఆనుకొని ఉన్న అతితక్కువ మంది రైతులు ఊట నీరుతో రెండు పంటలు పండిస్తున్న దృశ్యాలు కాలువ పొడవునా అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. అదేపూర్తి స్థాయిలో రైతులకు వినియోగంలోకి తీసుకువస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు ఊరట

పాలకుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో పుష్కలంగా సాగునీటి వనరులు ఉన్నా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాని పరిస్థితి నెలకొంది. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బంగారయ్యపేట వద్ద స్లూయిజ్ ద్వారా పంపాకు నీటి మళ్లించారు. దీంతో స్థానిక రైతులకు కొంత మేరకు మేలు చేకూరింది. ఇదే తరహాలో శాశ్వతంగా సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.



ఇ.గోకవరంలో అభివృద్ధికి నోచుకోని సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు



శిథిలావస్థకు చేరిన సుబ్బారెడ్డి సాగర్‌కాలువ

ప్రతి ఎకరాకూ నీరు అందించాలి



మండలంలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా వాటి వినియోగం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా మారతోంది. ఆయకట్టు చివర ఎకరాకూ సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది.

– చింతాకుల భూషణం, రైతు, పెద్దిపాలెం

జడేరుమడేరు జలాలు మళ్లించాలి



జడేరుమడేరు జలాలను సుబ్బారెడ్డి సాగర్‌కు మళ్లించాలి. అప్పుడే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. ఆయకట్టు పరిధిలో రెండు పంటలూ పుష్కలంగా పండుతాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది.

– మాకా చంటిబాబు, రైతు, పెద్దిపాలెం.

ఏలేరు జలాలను వినియోగంలోకి తీసుకురావాలి



ఏలేరు రిజర్వాయర్ ఎడమ కాలువ నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు మండలం మీదుగా వెళ్లే జలాలను రైతులకు వినియోగంలోకి తీసుకురావాలి. దీని ద్వారా రైతుల సాగునీటి కష్టాలు పూర్తిస్థాయిలో తీరుతాయి. ఇదే జరిగితే రైతుల పాలిట వరంగా మారుతుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– నిమ్మల చక్రం, రైతు, రౌతుపాలెం

వైభవంగా జగన్నాథస్వామి రథోత్సవం



తపోవనంలో జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ సచ్చిదానంద తపోవనం ఆశ్రమంలో ఆదివారం జగన్నాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శ్రీకాకుళం జిల్లా బొందిలీపురంలోని జగన్నాథస్వామి దేవాలయంలో జగన్నాథుడి రథయాత్రను పురస్కరించుకుని ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జగన్నాథుడి రథ ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందిస్తున్న రాజా

పెద్దాపురం: ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి కనబర్చాలని పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. మండలంలోని మర్లావ గ్రామంలో ఆదివారం సొంత ఖర్చులతో గ్రామానికి చెందిన విద్యార్థులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజా మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ విద్యతో పాటు, క్రీడలకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

అధ్వానంగా పంటకాలువ



ఏలేశ్వరంలో తుప్పలు, వ్యర్థాలతో అధ్వానంగా ఉన్న పంటకాలువ

ఏలేశ్వరం: పట్టణంలోని తిమ్మరాజుచెరువు ప్రధాన పంట కాలువలో తుప్పలు, వ్యర్థాలు పెరిగిపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాలువలో విపరీతంగా తుప్పలు పెరిగిపోయాయి. అడుగడుగునా పూడిక పేరుకుపోయింది. పట్టణాన్ని ఆనుకుని సుమారు రెండు కిలోమీటర్ల మేర కాలువ ఉంది. కాలువను ఆనుకుని దుకాణాలు, హోటల్స్ ఉండడంతో వాటి నుంచి వచ్చే వ్యర్థాలను కాలువలో వేస్తున్నారు. దీంతో పాటు కాలువ రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రి, లింగవరంకాలనీ తదితర ప్రాంతాల వద్ద కాలువలో తుప్పలు పెరిగిపోయి నీరు నిలిచిపోతోంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువలో తుప్పలు తొలగించడంతో పాటు దిగువ పొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్ వరిసాగు పనులు ప్రారంభం



కోటనందూరులో వరి పొలం దమ్ము చేస్తున్న రైతు

కోటనందూరు: మండలంలో ఖరీఫ్ వరిసాగు పనులు ప్రారంభమయ్యాయి. అల్పపీడన ప్రభావంతో ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలకు భూమిలో తేమ, చెరువులు, కాలువల్లో కొంతమేర నీరు చేరడంతో రైతన్నలు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలో 17 పంచాయతీల పరిధిలో ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారనే అంచాలుండగా బోర్లు, నీటి సదుపాయం ఉన్న రెండు వేల ఎకరాల్లో రైతులు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసి పొలాలను దమ్ము చేస్తున్నారు. తాండవ జలాశయంలో అరకొరగా నీటి నిల్వలు ఉన్న నేపథ్యంలో భారీగా వర్షాలు కురిస్తే తప్ప సాగు పనులు ఊపందుకునే అవకాశం లేదు. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు.

తొండంగి మండలంలో....

తొండంగి: కొద్దిరోజులుగా అడపాదడపా తొలకరి వర్షాలు కురుస్తుండటంతో మండలంలో ఖరీఫ్ వరి సాగు పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, రావికంపాడు, గోపాలపట్నం, శృంగవృక్షం తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ బోర్ల పరిధిలో సుమారు రెండువేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికే నారుమడులు సిద్ధం కాగా పొలాలను వరినాట్లు వేసేందుకు వీలుగా ట్రాక్టర్లతో దమ్ములు చేయిస్తున్నారు. మరో వారం పది రోజుల్లో నాట్లు వేయనున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లోనూ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



బెండపూడిలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

ఘనంగా గురుపూజోత్సవం



గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న రమణ

గోకవరం: గ్రామంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన గురుపూజోత్సవానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడు ఎస్ఎల్ రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యాసభగవానుడు, భారత మాత చిత్ర పటాలకు పూలమాల వేసి భగవధ్వజానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆర్ఎస్ఎస్ శాఖలు ఏర్పాటు చేసి యువతరాన్ని సంస్కారవంతులు, దేశభక్తులుగా మార్చవలసిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మట్ట మంగరాజు, సత్తి వెంకటరెడ్డి, ఇనకోటి బాపన్న, దొర దాసరి ధర్మరాజు, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అలయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పోలారావు

తుని: అలయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కోరుకొండ సత్యనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక కొత్తపేటలోని శ్రీసత్యసాయి యోగా సెంటర్‌లో క్లబ్ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా కె.భీమరాజు, ప్రధాన కార్యదర్శిగా వీఎస్ఆర్ అంజనేయప్రసాద్, కోశాధికారిగా డి.నూకయ్యశెట్టి, పీఆర్వోగా ఎస్.రాజబాబు, జీవీ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పరవాడ తాతబాబు, కుసుమంచి సత్యనారాయణ, రవి, డీపీ నాయుడు, నాగేశ్వరరావు, నాగరాజు, సత్యనారాయణ ఎన్నికయ్యారు. వీరితో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దండెం పోలారావు, ఇంటర్నేషనల్ కార్యదర్శి రాజేశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉషారాణి ప్రమాణం చేయించారు. అనంతర క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. క్లబ్ సేవలను మరింత విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

స్మార్ట్ సిటీలో వెలగని వీధి లైట్లు

కాకినాడ సిటీ: స్మార్ట్ సిటీ కాకినాడ నగరంలో వెలగని వీధి దీపాలు ఎక్కువగా ఉన్నాయని, దాదాపు 40 శాతం మేర దీపాలు వెలగడం లేదని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం విలేకర్లకు తెలిపారు. నగరంలోని శాలిపేట, జవహర్‌వీధి వంటి ప్రధాన రహదారుల్లో అంధకారం ఎక్కువైందన్నారు. అదే విధంగా 35, 39, 40, 42, 13, 24, 11, 8, 3, 12, 33, 46 డివిజన్లలోని పలు వీధుల్లో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగక పోవడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చీకట్లో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, పాదచారులు, మోటారు సైకిళ్లపై వెళ్లే వారిని తరుముతున్నాయన్నారు. ప్రజల ఫిర్యాదులతో ప్రమేయం లేకుండా కార్పొరేషన్ అధికారులు వెలగని వీధిదీపాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో స్థానిక కమిటీలతో పబ్లిక్ డిమాండ్‌గా రెడ్ నోటీసులు వేలాడదీస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఏలేశ్వరంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

ఏలేశ్వరం/తుని/గోకవరం/ప్రత్తిపాడు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు ఆదివారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఏలేశ్వరం బాలాజీ చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం త్వరగా ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. భద్రవరంలో వంగలపూడి నాగబాబు, అప్పన్నపాలెంలో సంజయ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తుని పట్టణంలోని కొండవారిపేట, ఇసుకలపేట, వీరవరపుపేట, తారకరామనగర్ ప్రాంతాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఆదియాంధ్ర శ్రమ కార్మిక సంఘం, బూట్ పాలిష్ సంఘం, యూత్ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఆరుగుల సత్తిబాబు పాల్గొన్నారు. గోకవరం సంజీవయ్యనగర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు అంబేడ్కర్ కళా మందిర్ వద్ద ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మోర్తా ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ కళామందిర్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కొత్తపల్లి: పిఠాపురం రథాలపేటలోని అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యునిటీ హాలులో సోమవారం నియోజకవర్గస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బుద్ధుని మహాస్థూపం సందర్శన



కొడవలిలో బుద్ధుని మహాస్థూపాన్ని దర్శించుకుంటున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీమన్నారాయణ

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఉన్న బుద్ధుని ధాతుగర్భ మహాస్తూపాన్ని ఆదివారం హైకోర్టు సీనియర్ న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ సందర్శించారు. కొడవలి బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి తరఫున బౌద్ధక్షేత్ర సంరక్షణ కోసం హైకోర్టులో కేసును శ్రీమన్నారాయణ వాదిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పురావస్తు శాఖ రక్షిత కట్టడంగా ప్రకటించిన ఏ పురాతన క్షేత్రంలోనూ తవ్వకాలు జరగరాదని, అందుకు విరుద్ధంగా కొడవలి బౌద్ధ క్షేత్రంలో తవ్వకాలు జరిగాయన్నారు. కొడవలి బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి ఇక్కడ తవ్వకాలను నిలిపివేస్తూ స్టే తీసుకువచ్చామని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అతిక్రమించి ఆ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతుందనే విషయం పరిశీలించి, వాస్తవాలను తెలుసుకోవడం కోసం క్షేత్ర పర్యటనకు వచ్చామన్నారు. ప్రధానబౌద్ధ క్షేత్రంలో ఉన్న ధనం దిబ్బ కొండతో పాటు, నామాల కొండ, తురకల కొండ, మైనింగ్ ప్రాంతలను తమ బృందం పరిశీలించిందన్నారు. వాస్తవాలను హైకోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి అధ్యక్షుడు పెయ్యల పావన్ ప్రసాద్, కార్యదర్శి కాశి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన మరిడమ్మ సంబరం

- ఆలయానికి బారులు తీరిన భక్తులు
- అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం



మరిడమ్మ అమ్మవారు



మరిడమ్మ ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా తొలి ఆదివారం సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భారీ క్యూ కట్టారు. అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు అన్ని చర్యలు చేపట్టారు. తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వెలుగుల సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారుల అంచనా. పలు స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేశారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఘనంగా చేపల వీధి సంబరం

ప్రతి వారం నిర్వహించే వీధి సంబరాల్లో భాగంగా ఈ వారం స్థానిక చేపల వీధి సంబరం అంబరాన్నంటింది. భారీ సంఖ్యలో భక్తులు వీధి సంబరంలో సందడి చేశారు. కోలాటం, మ్యూజికల్ నైట్, కాళీ వేషాలు, దేవతామూర్తుల వేషధారణలు, భారీ విద్యుద్దీపాలంకరణ మధ్య అత్యంత వైభవంగా సంబరం జరిగింది.